# కోపించిన గోపాలం

"రాణీ! ఓ రాణీ!"

పిలిచి, టేబిల్‌మీది పుస్తకాలూ కాగితాలూ వెతకడంలో మళ్లా నిమగ్నమై పోయాడు గోపాలం.

రెండునిమిషాలైనా ఆమె రాలేదు.

మళ్లీ పిలిచాడు గోపాలం... మరి కొంచెం గట్టిగా.

ఈసారీ జవాబు రాలేదు. కాని కొంచెంసేపట్లో రమామణి వచ్చింది.

అతన్ని చూడనట్టే గదిలోనుంచి వీథి గుమ్మందాకా వెళ్లి మళ్లీ లోపలికి పోతోంటే, "ఏం, పిలుపు వినపడలేదా?" అన్నాడు గోపాలం.

"నన్ను పిలిచేరా?"

"మరి? గొంతు చించుకునేలాగ.... ఏం చేశాననుకున్నావు?"

"ఓ అదా! పేకాటలో పడ్డారేమో, ఆసూ, రాజూ చేతిలో ఉంటే మూడో ముక్కని

పిలుస్తున్నా రేమోననుకున్నాను...'' అంది కొంచెం ఉక్రోషంతో రమామణి.

ఎందుకనో, అతను రాణీ అని పిలిస్తే ఆమెకి ఒళ్లుమంట - దానిక్కారణం ఆమె ఎప్పుడూ స్పష్టంగా చెప్పలేదు...అది అడిగేందుకు తగిన సమయం రానూలేదు. ప్రస్తుతం అలాటి సమయం కానూకాదు. కాని, అతనికి ఊరుకోవాలనీ లేదు.

''అవును! అవతల ఆఫీసుకి టైమవుతోందిగా! నేను రమ్మీ నాతోనూ, నా ఆత్మతోనూ, నా ప్రతిబింబంతోనూ ఆడుకుంటాను...నీకు ఇమేజినేషన్ ఎక్కువైపోతూంది.....ర......ర....రమామణిగారూ!'' అన్నాడు గోపాలం,.

రమామణి- రమకి కొంచెం కోపం వచ్చింది.

''గో...గో...గో...'' అని మొదలెట్టి ''పాలంగా-రూ'' అనే లోపున ఆమెని నవ్వు మింగేసింది. తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం అందులో కరిగిపోయింది.

''వెడతాను... వెడతాను. నాకూ టైమవుతోంది....''

''ఇవిగో తాళాలు-మరిచే పోయారు.''

''ఇచ్చీ!....నువ్వెక్కడికో వెడతావని మరిచేపోయాను-'' అన్నాడు గోపాలం తాళాలు జేబులో వేసుకుంటే.

''అందుకేనా పిల్చారు?''

''అబ్బే ....మొన్న ఓ ఉత్తరం - కవరు - ఇక్కడెక్కడో పెట్టేను...''

''పెడితే?''

''కనబడ్డంలేదు!''

''బాగుంది! ఎప్పుడో వొచ్చిన ఏదో ఉత్తరం ఎక్కడో పెడితే నాకేం తెలుస్తుంది?''

''మరి?''

''కనబడుటలేదు'' అని, ప్రకటన వేయించండి.''

''ధన్యవాదాలు....'' అని టైముచూసి, త్వరగాకారులో వెళ్లిపోయాడు గోపాలం.

రమ ఓసారి పనవ్వుకుని, తలుపులు వేసుకుంది. ఈ ఆర్గునిమిషాల్లోనూ అతను ఆఫీసుకి చేరుకుంటాడు. పది నిమిషాలు ముందుగా బయలుదేరాలని అతనికి రోజూ అనిపించినా, ఆటైముకి రోజూ ఏదో చిన్న గాలివాన... ఇలాగే. ఆమె ఒకసారి టేబిల్‌మీద చిందర వందరగా పడిఉన్న కాగితాలూ పుస్తకాలు మళ్ళీ అమర్చిపెట్టి వాటిక్రింద బోర్లాపడిఉన్న ఫోటో ఫ్రేములో ఉన్న గోపాలాన్ని ఆప్యాయంగా యధాస్థానంలో నిలబెట్టి లోపలికి

వెళ్ళిపోయింది.

అది ఆమెకి సుమారుగా దినచర్యే. గోపాలం తనని వొదిలి త్వరగాపోలేడు.

ఆమాట అతనికీ తెలుసును. కానీ అంగీకరించడు - ఆఫీసు చేరగానే ముందరగా ఒకసారి వాలెట్ తీసి, రమ ఫోటో చూసి, చిరునవ్వుతో, "పిచ్చిపిల్ల!' అనుకుని, వాలెట్ ముడిచి జాగ్రత్తగా డ్రాయర్‌లోపెట్టి, డాక్ చూసుకోవడం సాగిస్తాడు.

అది అతని దినచర్య.

ఇవాళా అంతే....

పదినిముషాల డాక్ చూసి అవసరమైన ఆజ్ఞలు జారీచేసి, ఒక ఫోల్డరు తీసి స్టడీలో మునిగిపోయాడు గోపాలం. మళ్లీ తలెత్తేసరికి మేరీ నిలబడి ఉంది.

"ఏమిటి?"అన్నట్టు చూశాడు.

"టెలిగ్రామ్... మీ ఫ్రెండునించి.."

గోపాలం ఆత్రతతో అందుకుని, టెలిగ్రామ్ చదివేడు - మెయిల్లో రాజశేఖరం వొస్తున్నాడు - కలుసుకోవాలి....

అరే! అనుకున్నాడు.

రాజశేఖరానికి క్రిందటివారమే పెళ్ళి అయింది - గ్రీటింగ్స్ పంపి ఊరుకున్నాడు....ఎలా వెడతాడు? తను ఒక్క రోజు వెళ్లినా ఈ బ్రాంచిలో పని జరగదు...వాడేమో చివరి నిమిషంలో శుభలేక పంపి ఊరుకున్నాడు-కనీసం అడ్రసు ఇవ్వలేదు -

"మెయిలు రైట్ టైమ్..మీరు పది నిమిషాల్లో బయలుదేరాలి..."

"థాంక్స్....ఒక బుకే తెప్పించడం అవుతుందా!"

"ష్యూర్!...."

ఒక చిరునవ్వు విసిరి వెళ్ళిపోయింది.

ఆమె చాలా అందగత్తె...ఆమాట రమ చెప్పినదే! తన పెళ్లి అయి తానూ రమా వచ్చేటప్పుడు రిసీవ్ చేసుకునేందుకు వొచ్చిన ఆఫీసందరిలోనూ ముందర మేరీయే పలకరించింది రమని.... సంవత్సరం కావొస్తున్నా ఆక్షణంలో రమ ఏమనుకుంటుందోనన్న ఆత్రత ఇప్పటికీ అతనికి జ్ఞాపకం ఉంది. అందమైన సెక్రటరీలంటే అందరు భార్యలకీ అనుమానమేనని అతనికీ తెలుసును.

పదిహేనురోజుల తరవాత సందర్భం ఏమీ లేకుండానే, "మేరీ చాలా అందగత్తె కాదూ?" అంది రమ.

అతను ఆమె కళ్ళలోకి చూశాడు... మాటల్లో ధ్వనించని భావం ఏదో ఆమె చూపుల్లో కనిపిస్తుందనుకున్నాడు. కాని అలాటిదేమీ లేదు.

"అవును. అంతకన్నా, ఎఫిషెంట్."

"అందంకూడా ఒక ఎఫిషియన్సీయే." అంది రమ.

"నీ ఇంగ్లీషు విట్ నామీద ప్రయోగించకు - మరేదైనా నాకర్థమయేది ప్రయోగించు."అన్నాడు అప్పటికి ఆ సంభాషణ మారుతోన్నందకు తేలికపడుతూ గోపాలం. సాక్ష్యం ఏమీలేకపోయినా, రమ అంతరాంతరాల్లో ఏదో చీకటితెర ఎక్కడో ఉండకపోదని అతనికి బలంగా నమ్మకం కలిగింది. లేకపోతే ఆమె మాటలకి అర్థంఏమిటి?

ఆ తరవాత - ఆరునెలలయింది- ఒకనాడు ఉదయమే తాను ఆఫీసుకి వొస్తూనే మేరీ పెద్ద బుకే తెచ్చి ఇచ్చింది. ఆశ్చర్యంగా దానికి కట్టి ఉన్న చీటితీసి చదివేడు గోపాలం. "ఫ్రమ్ యువర్..." అని ఆపేసి, నాలుగు చుక్కలూ, ఒక యారో మార్క్యూ.

"ఏమిటిదంతా?" అన్నాడు ఏమీ అర్థంగాక, చిరాకుగా. మేరీ బుగ్గల లొత్తలు కనిపించే చిరునవ్వుతో నిమిషం పాటు తనవంక తేరిపారచూస్తూ నిలబడింది. అతను మళ్ళీ ఆమెవైపు, ఆ కార్డువైపు ఎగాదిగా చూసే సరికి ఆమె బుగ్గలకి రంగు వొచ్చేసింది.

అతని గుండె ఝల్లుమన్నది...మేరీ! తనని....! ఆ పరిస్థితి విషప్రాయంగా కనిపించింది. ఇలాటి పరిస్థితులంటే అతనికి భయం - ఆమెని వెంటనే ఉద్యోగం నించి తీసెయ్యాలనీ, మరో మగ సెక్రటరీని పెట్టుకోవాలనీ, రమకిదంతా ఎలా చెప్పాలనీ - తానెన్నడూ, క్షణికంగా కూడా మేరీని అనురాగదృష్టితో చూడలేదనీ అతనికి పరంపరలుగా ఎన్నో ఆలోచనలు వచ్చాయి.

కార్డు వెనుకాల చూడమని మేరీ వేలితో సంజ్ఞచేసింది.

అతను కార్డువెనక చూసేసరికి "హేపీ బర్త్‌డే! రమ....." అని ఉంది.

అతను చాలా తికమకపడ్డాడు - అది తన పుట్టినరోజని అతనికి జ్ఞాపకమే లేదు! రమకు ఎలాగ జ్ఞాపకం ఉందో!

"థాంక్స్." .. అన్నాడు గాభరాగా.

"నాక్కాదు... రమగారికి.." అంది.

'ఇదంతా మీ ఇద్దరి ఎత్తుగడా!... నేను మరిచేపోయాను!" అన్నాడు గోపాలం.

ఆమె జవాబివ్వకుండా అతని ఇంటి నంబరు డయల్‌చేసి "జస్టేమినిట్" అని అతనికి రిసీవరిచ్చేసి తలుపువేసి వెళ్ళిపోయింది.

అప్పుడు రమతో జరిగిన సంభాషణ కేంగాని, అతని ఆలోచనలు మళ్లా "అందమైన సెక్రటరీలు వర్సస్ భార్యలు - ముఖ్యంగా నూతనవధువులు - మీదికి మళ్లేయి. రమ అలాగ ఎందుకుచేసింది? ఈ చర్యల్లో తనకి అందని సూక్ష్మమైన మనస్తత్వశాస్త్ర సూత్రం ఏదైనా ఉందా?

అదేమీ రమప్రవర్తనలో కనిపించలేదు... "ఎంతమంచిదండీ మేరీ!.... నేను చెప్పగానే అలాగేనంది... అని ఒకటేపనిగా రమ మెచ్చుకోవడం అతనికి అర్థంకాలేదు - ఏదో అసంతృప్తి..

"మీరు బయలుదేరడం మంచిది... "అంది ఇంటర్‌కాం మీద మేరీ.

"థాంక్స్..."

అతను వెళ్లి కారులో కూర్చున్నాడు.చక్కటి పూలమాల, బుకే, స్వీట్స్, ఏదో మరొక పేకెట్ - పుస్తకంలాగ ఉంది.అన్నీ సీటుమీద చక్కగా అమర్చి ఉన్నాయి.

కారు కదులుతుంటే మేరీ పరుగున వొచ్చి... "సారీసర్... ఇవేళ హాఫ్‌డే - ఆఫీసు ఒంటిగంటకి కట్టెయ్యాలి - జ్ఞాపకంఉందా? అంది.

అతను మరిచేపోయాడు.

"మీరు ఇంటికి వెళ్లిపోతారా! లేక..."

"అర్జెంటు కాగితాలు..."

"ఏమీలేవు. నాలుగ్గంటలకివొచ్చి చూస్తాను. టెలెక్స్ ఏమైనా ఉంటే ఫోన్ చేస్తాను - మీ వాలెట్ ఇదిగో!

కారు కదిలింది.

అంత తక్కువ వ్యవధిలో మేరీ అన్ని ఏర్పాట్లెలాగ చేసిందోనని ఆలోచించి, గోపాలం సంతృప్తిపడ్డాడు - ఆమెలాటి సెక్రెటరీ దొరకడం తన అదృష్టం అనుకున్నాడు.

కాని...

అతనికి కొద్దికాలం క్రిందట జరిగిన ఒక ఉదంతం జ్ఞాపకంవొచ్చింది. అదేమంత పెద్దవిషయంకాదు. కాని మేరీ సరిగ్గా, ఆదర్శప్రాయంగా ప్రవర్తించిందో లేదో అతనికి తెలీదు.

హెడాఫీసునించి అప్పుడొక ఉత్తరం వొచ్చింది - ఏదోపనిమీద గొపాలాన్ని కాంటినెంట్ పంపేందుకుసూచనచేస్తూ. రెండు వారాలపని. అతని అంగీకారం అడిగారు.

ఒంటరిగా వెళ్లడం అతనికిష్టంలేదు - వెడితేరమతో వెళ్లాలి. లేకపోతే, తప్పనిసరికాదు

కనుక మానెయ్యాలి. ఇద్దరూ వెడితే అదనపు ఖర్చుభరించగలనా అని ఆలోచించాడు. టికెట్ ఎంతో మేరీ ద్వార తెలుసుకుని, ఆ ప్రయత్నంనించి విరమించాడు.

ఆ సాయంత్రం ఏదో మాటల సందర్భంలో రమ నోరుజారినట్టుగా అతని కాంటినెంట్ ట్రిప్ మాటతెచ్చింది - తనకీ మేరీకే మాత్రం తెలుసునని అనుకున్న గోపాలం కొంచెం ఆశ్చర్యంగా "ఆ సంగతి నీ కెలాగ తెలుసును?" అన్నాడు.

రమ నవ్వుతూ, "ఎలాగైతేనేం? నిజమేకదా!,... మరొకసారినన్ను తీసుకుని పోవచ్చును. మీరు వెళ్లి రండి! అంది.

"కుదరదు... నాకలాగ వెళ్లాలనిలేదు." అన్నాడు గోపాలం.

"మీరు వినోదానికి పోవడంలేదు కదా! వ్యాపారంమీద. నామాటవినండి అంది రమ.

"వీల్లేదు... అసలు వెళ్లనని రాశాను."

"ఇంకా మీరు సంతకం చెయ్యలేదుగా!" అంది రమ.

అతనికి చాలా అశ్చర్యంవేసింది. మేరీయే ఈ విషయం సవివరంగా రమకి చెప్పిందని ఇంక అతనికి ఏ అనుమానమూ మిగలలేదు. మేరీమీద రమకి ఈర్ష్యకాని, అనుమానంకాని లేక పోవడమేకాదు - తనకి తెలీకుండానే వాళ్ల మధ్య ఏదో సాన్నిహిత్యం వొచ్చిందన్న మాట! అనుకున్నాడు. ఇందులో సంతోషించాల్సింది ఎక్కువో, విచారించాల్సింది ఎక్కువో, అతను నిర్ధారించుకోలేక పోయాడు... కాని, ఈ పరిస్థితికన్నా, సహజంగా రమ మేరీని ద్వేషించిఉంటే నయంగా ఉండిఉండును, అని అతని కనిపించింది.

మానవసహజమైన దౌర్బల్యాలకి రమ అతీతురాలేమీ కాదు... పెళ్లిలోనే ఓ అమ్మాయి-రమకి దూరపు బంధువుట - ఒకటికి నాలుగుసార్లు వొచ్చి అతనితో కలుగజేసుకుని మాట్లాడితే ఆమె ఆ అమ్మాయికి బుద్ధిచెప్పడం తాను విన్నాడు. ఆ తరువాత, ఏ అమ్మాయయినా మరొక సారి చూస్తే, "ఏమండీ? జాగ్రత్త! నేను చూస్తున్నాను!" అని హాస్యంగానే అన్నా, అందులో కొంత గంభీరతకూడ ధ్వనిస్తూనే ఉండేది. ఆ తరువాత క్షణాలలో తన కేమనిపించినా, ఆ చిన్న ఈర్ష్యలో అతనికి చాలా సంతృప్తి కనిపించేది.

అలాటి అసహనమే మేరీ విషయంలోనూ రమకిఉంటే చాలా నయంగా ఉండేది. అతిగా కాదుగాని, కొంచెం...

స్టేషనుముందు కారాగింది.

అతను దిగి, ప్లాట్‌ఫామ్ టికెట్ కొనుక్కుని లోపలికి వెళ్లాడు. వెనుకనే డ్రైవరు.

అప్పుడే రైలువొస్తూంది. అదికూడ మేరీ ఏర్పాటుచేసినట్టే జరిగింది!

నిమిషంలో రాజశేఖరాన్ని చూచి, కౌగలించుకుని, అతనికీ శ్రీమతికీ ఇవ్వవలసినవి ఇచ్చి, వాడిచేత పెళ్లికి రానందుకు చీవాట్లు తిని, "ఆయనకి కుదిరితే వొచ్చిఉండరా?" అనే వాడి శ్రీమతి మాటలనీ, "నీకింకా వీడిసంగతి తెలీదులే!" అనివాడి మాటల్నీ యధోచితంగా సత్కరించి మిగిలిన విషయాల్లో పడి, కూల్‌డ్రింక్స్ (అవీ డ్రైవరు తెప్పించేడు) తాగి, "మరేమిట్రా?... మావూరు ఎప్పుడొస్తావు?" అని అడిగే సరికి రైలుబయలుదేరే టైమయిపోయింది. వాగ్దానాలు జరుగకుండానే రాజశేఖరం రైలెక్కాడు. అంతకుముందే కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని అతనికోసం అత్రతగా చూస్తున్న అతని శ్రీమతి ఇటుచూడనే లేదు.

బావుంది అనుకుని, ఒక అరనిమిషం రైలువేపు చూస్తూ నిలబడి వెనక్కి వెళ్లడానికి నాలుగడుగులు వేశాడో లేదో వసుంధర కనిపించింది.

వసుంధర!అతని గుండె రెండుసార్లు గంతులు వేసింది. ఏనాటి వసుంధర! మూడేళ్ల యిందికాబోలుచూసి! - అంతే. బి.ఎస్‌సీ. లో ఇద్దరు కలిసి చదివారు. తనంటే ప్రాణంపెట్టేది - కుదిరినప్పుడల్లా తనతో తిరిగేది. అంత అందగత్తె అయినా, తన కంత సన్నిహితంగా ఉన్నా, ఎవ్వరూ ఒక్క తప్పుడుమాట అనలేకపొయ్యేవారు. ఆమెలో అలాటిశక్తి ఏదో ఉండేది.

"అరే గోపాలం! నువ్వేనా?"... అంటూ వసుంధర ఎంతో ఆప్యాయంగా తానే పలకరించింది.

"ముమ్మూర్తులాను!... నువ్వేమిటి ఇలాగ? - ఎలావొచ్చావు?"

"తెలియడంలేదూ? పేసింజర్లో!"

"అదికాదు వసుంధరా, ఎందుకొచ్చావని. నాకు ఉత్తరం అయినా రాయలేదేం?"

వసుంధర నవ్వింది. అప్పటికన్నా ఎంతో బాగుంది!

"రాసేదేమిటి? నువ్వొస్తావని తెలుసుగా?"

గోపాలం విచిత్రంగా చూశాడు.

"గాభరాపడకులే... నేను అలహాబాద్‌పోవాలి - రాయపూర్ బండీలో వెళ్లాలి. ఎక్స్‌ప్రెస్‌కి వొస్తే లేటవుతుందని ఈ బండిలో వొచ్చేశాను..."

"అలహాబాద్ - ఎందుకూ?

మళ్లీ నవ్వింది వసుంధర.

"ఆమాట ఆయన్నడుగు - ఆయనంటే ఎవరని అడక్కు."

"?"

"పిల్లల్లేరుగాని ఉంటే నా పిల్లలతండ్రి అని చెప్పేదాన్ని - అలాగే చెప్పాలిగా?" అంది వసుంధర.

"నీ కొంటెతనం పోలేదు! అన్నాడు గోపాలం.

"అది పోయినా, పోకపోయినా, ఈ స్టేషన్లో ఇలాగ నిలబడిఉంటే ప్రాణం పోతుంది.... వెయిటింగ్ రూంలో ఉండాల్సి వొస్తుందని హడలిపోయాను - నీకేమైనా ఇల్లు అదీ ఉందా? మీశ్రీమతి - గౌరవనీయురాలు - నన్నక్కడ ఈ నాలుగ్గంటలూ విశ్రాంతి తీసుకోనిస్తుందా?... త్వరగా తేల్చి చెప్పు!" అంది వసుంధర.

"పద - ఈ ప్రశ్నలన్నిటికీ -"

"జవాబు మీ కిటికీతెరలపై చూస్తాను. ఏం?"

"అదేమిటి?"అని అడిగేడు గోపాలం.

"ఏ ఇల్లాలి గురించేనా వాళ్ల కిటికీ తెరలనిబట్టి చెప్పడంలో నేను స్పెషలిస్టుని. కావలిస్తే ఆయన్నడుగు... మా ఇంటి కిటికీలకి తెరలు... పోనీలే. అది నీ కారేనా? గుడ్! ఈ రిక్షాలెక్కిస్తావేమో నని భయపడ్డాను!" అంటూ కారులో కూర్చుంది వసుంధర.

గోపాలం చాలా సంతోషంగా ఉన్నాడు. పెళ్లయినా వసుంధర అట్టే మారలేదు... మరికొంచెం ఆకర్షణ పొందడం తప్పిస్తే. ఆ రోజుల్లోని ఈమె వాక్ప్రవాహమూ, అన్నీ జ్ఞాపకం వొస్తున్నాయి.

కార్లో కూర్చున్నాక వసుంధర మాట్లాడలేదు.

రమ ఈమెని చూసి ఏమనుకుంటుంది?.. ఈమె అందగత్తె అన్న ఈర్ష్య ఆమెకి ఉండదు. అది చాలా మంచిది. మామూలు మనిషి అయితే, తాను వసుంధరని ఇంటికి తీసికెళ్లగలిగి ఉండే వాడేకాదు... ఆమెని అపార్థం చేసుకోవడం చాలా సులువుమరి!

ఈమె అంటే రమ చాల ఇష్టపడుతుంది - అని నిర్ధారణ చేసుకున్నాడు గోపాలం.

గేటువద్గర కారు దిగి సామాను లోపలికి తెమ్మని డ్రైవరుకి చెప్పి వసుంధరని లోపలికి తీసుకెడుతోంటే వసుంధర అతని భుజంమీద చెయ్యివేసి, "చూడు, ఇలాహఠాత్తుగా వొస్తే నీ శ్రీమతి ఏమంటుంది?" అంది.

"ఏమీఅనదు - సంతోషిస్తుంది!" అన్నాడు గోపాలం.

"అదర్శ దాంపత్యం అన్నమాట, మీది!" అంది వసుంధర.

"పద - నీకే తెలుస్తుంది..."

అతను అడుగు వేస్తూ ఏదో చప్పుడయితే పక్కకి చూశాడు - చిన్న ప్రహరీ గోడ అవతల పక్కఇంటి పిన్నిగారు తనవంక కన్నార్పకుండా చూస్తున్నారు. తానటుచూడగానే ఒక్కసారి మరోపని దేనిలోనో నిమగ్నమైపోయారు.

"డామిట్!" అనుకుని ముందుకి సాగేడు - ఈ పక్కింటి పిన్నిగారు కథల్లో పక్కింటి పిన్నిగారే! ఆవిడ సాయంత్రం లోగా ఇది స్టాప్‌ప్రెస్ వార్తకింద అందరికీ అందిస్తుంది కాబోలు!

తాళం వేసిఉంది.

"నిజంగా మీది ఆదర్శ దాంపత్యం లాగే ఉందే! కీ ఉందా?" అంది వసుంధర.

అతను తాళం తీసి ఆమెని లోపలికి తీసికెళ్లాడు. "రమ ఎక్కడికో వెడతానంది. గడియో క్షణమో, వొచ్చేస్తుంది." అన్నాడు, ఆమెని తొందరగా లోపలికి తీసికెడుతూ.

వసుంధర లోపలికి వెళ్లి సోఫాలో కూర్చుని, "కొంచెం కాఫీ వొచ్చే ఉపాయం యేమైనా ఉందా? లేక శ్రీమతితో బాటు దానికీ కరువేనా?" అంది.

గోపాలం డ్రైవర్‌ని కాఫీ కోసం పంపి, తలుపువేసి లోపలికి వొచ్చాడు. ఆమెకెదురుగా కూర్చుని, "నీ మాటలేమీ చెప్పనేలేదు వసుంధరా... ఎలా ఉంది జీవితం?" అన్నాడు.

"చెప్పేందు కేమన్నా ఉంటే నిన్ను చూడగానే చెప్తానుగా! నన్నుచూస్తే తెలీడంలేదూ!" అంది.

గోపాలం ఏదో అడగాలనుకుని, ఏమీ అనకుండా ఊరుకున్నాడు. అతనికి రంగారావు - రమ అన్నయ్య - జ్ఞాపకం వొచ్చాడు... అతను నెలకీ రెండునెలలకీ ఒకసారి వొచ్చివెడుతూ ఉంటాడు.వొచ్చినప్పుడు ఎలా ఉన్నావు బావా? అంటే చాలు - ఒకగంట తన కష్టాలన్నీ ఏకరువు పెడతాడు. అన్నీ బాగా కలిసి వొచ్చిన మనిషి... కానీ...

అతనికీ వసుంధరకీ భేదం గురించి అతను ఆలోచిస్తూంటే వసుంధర "నీ ఇల్లు చూపెట్టు. నిన్ను చూస్తే ఏమిటి తెలుస్తుంది? ఇల్లుచూడు ఇల్లాలిని చూడు అన్నారు పెద్దలు!" అంటూ లేచింది. ఆమె వెనకాలే అతను. ఉన్న మూడుగదులూ వంటిల్లూ గార్డెనూ చూసి అప్పటికి వొచ్చిన కాఫీతాగడంలో నిమగ్నమయ్యారు.

కాఫీతాగాక "చూడుగోపాలం! నేనో అరగంట రెస్టుతీసుకుంటాను... శ్రీమతి గారు వొస్తే నిద్రలేపు. లేకపోతే నాలుక్కి లేపు... అయిదుకి బయలుదేరుతాను అని, వెళ్లి నిద్రపోయింది.

గోపాలం డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చున్నాడు. అతనికి ఇందాకా పక్కయింటి

పిన్నిగారు చూసిన చూపు జ్ఞాపకం వొచ్చింది... ఈ ఇంట్లో ఒంటరిగా వసుంధరతో ఉండడం క్రమంగా ఇబ్బందిగా తోచసాగింది. క్రమంగా రమమీదికి ఆలోచన వెళ్లింది... రమ ఏమనుకుంటుంది?

అతనట్టే ఆలోచించేలోగానే కాల్‌బెల్ వినిపించింది. రమ అయిఉంటే బాగుండును.. అనుకుంటూ లేచి తలుపు తీశాడు!

పక్కయింటి పిన్నిగారి అమ్మాయి.

"రమక్క లేరాండీ?" అంది ఆమె అతనికీ, ద్వారానికీ మధ్యనున్న సందుల్లోనించి లోపలికి చూస్తూ.

"లేరు..." అన్నాడు గోపాలం.

"నేను... మా..."

"ఏమిటి?

"అదేనండీ టెలిఫోన్ చెయ్యాలి... మెయిలొచ్చిందేమోనని..."

"మెయిలొచ్చి గంట దాటింది" అన్నాడు గోపాలం.

"నిజంగా?"

"ఆఁ... నేను స్టేషన్‌కి వెళ్లానుగా! రెండుమెయిళ్లూ వొచ్చివెళ్లిపోయాయి". అన్నాడు గోపాలం.

అమ్మాయి ఆలోచనలో పడింది.

గోపాలం తలుపుకి అడ్డంగా నిల బడ్డాడు. అటు బెడ్‌రూములో వసుంధర తలుపులు ముయ్యలేదు...

"పోనీండి తరువాత ట్రెయిన్ ఏదో ఎప్పుడో కనుక్కుంటాను... ఓ సారి టెలిఫోన్ చేస్తాను!"

గోపాలం ఓడిపోయాడు. 'సరే' నని ఆమెకి దారిఇచ్చాడు. అమ్మాయి నాలుగుసార్లు డయల్‌చేసి, పదిసార్లు బెడ్‌రూమ్‌వైపు చూసి చివరకి ఫోన్ వదిలేసి, "అక్కగారు నిద్రపోతూన్నట్టున్నారు"... అంది.

"అక్కగారు కాదు.. " అన్నాడు గోపాలం చిరాగ్గా.

"మరి? ఎవరో చుట్టాలా?"

"అవును"

అయిష్టంగానే ఆమె వెళ్లిపోయింది.

గోపాలం ఓడిపోయి సోఫాలో కూర్చున్నాడు వసుంధర నిద్రకళ్లతో వొచ్చి అతనిపక్కన

కూర్చుని, "ఎవరా అమ్మాయి?" అంది.

"పక్కింటివాళ్ల ... నువ్వు నిద్రపోలా!" అన్నాడు గోపాలం.

"లేదులే. మరి మీ శ్రీమతి ఎక్కడికి వెళ్ళినట్టు?"

"తెలీదు. ఈ పాటికొచ్చిఉండాలి."

మళ్ళీ కాల్‌బెల్ మోగింది. గోపాలం లేచివెళ్లి తలుపుతీశాడు.

మేరీ.

ఒక ఉత్తరం, ఒక టెలెక్సు అతని కిచ్చి, "ఇది చూపి వెళ్లిపోదామనుకున్నాను... " అంటూ వసుంధరవైపు చూసింది.

గోపాలం వారిద్దర్నీ పరిచయం చేశాడు. టెలెక్సు చూసి, "రేపు చూద్దాం..." అన్నాడు.

"నేను వెడతాను మరి"... అంది మేరీ, లేవకుండానే.

"తొందర ఏమిటి?"

"తొందర ఏమీలేదు... కాని వెళ్తాను."

ఈసారి మేరీ లేచి వెళ్ళిపోయింది. గోపాలం ఆమె ముఖంలోకి క్షణకాలం పరీక్షగా చూశాడు... ఆమె కళ్ళలో ఏదో అనుమానం ఉందా?

అతను చాలా ఇబ్బంది పడ్డాడు. అందమైన వసుంధర. ఆ నిద్రమొహం, ఇంట్లో ఎవరూలేని సమయం.. మేరీ ఏమనుకుంది? తనని గురించి అనుమాన పడిందా?

ఇదంతా రమకి చెప్తుందా?... వాళ్లిద్దరికీ మధ్య తన రహస్యం ఏదీ దాగదు... అతని గుండె చాలా త్వరగా కొట్టుకుంది. పక్కింటి పిన్నిగారూ, వాళ్ళమ్మాయీ కలిసి ఈపాటికి...

"ఏమిటంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు? నీ సంగతి తెలియనిదాన్నయితే మేరీ గురించి అనుకుందును!" అంది నవ్వుతూ, వసుంధర.

"ఏమీలేదు...కాఫీ తాగుదామా?"

"మళ్ళానా? చాలా చెడు అలవాట్లు వొచ్చాయి నీకు!"

గోపాలం లేచివెళ్ళి కాఫీతెచ్చి ఇస్తూ, "సారీ! నీకు ఇంతకన్న ఆతిథ్యం ఇయ్యలేకపోతున్నాను! అన్నాడు.

వసుంధర నవ్వి, కాఫీ తీసుకుని, "పూర్ గోపాలం! భగవాన్ దయవల్ల నువ్వేమీ మారలేదు" అంది.

మరో అరగంట కబుర్లతో గడచిపోయింది. ప్రతి రెండు నిమిషాలకీ గోపాలం వాచీ చూసుకుంటున్నాడు.

"ఏం శ్రీమతి రాలేదనా? లేక, వొస్తుందనా?" అంది కొంచెం నిమిషాల నిశ్శబ్దం

తరువాత, వసుంధర.

"ఈపాటికి రావాల్సింది..." అన్నాడు. పట్టుబడిన వాడిలాగ గోపాలం.

"రైలుకి టైమవుతూంది... నేను స్నానంచేసి వొస్తాను..." అని, వసుంధర లోపలికి వెళ్ళిపోయింది. గోపాలం అశాంతితో పచార్లుచేసి చేసి, వసుంధర రాగానే స్టేషన్‌కి బయలు దేరేడు. డ్రైవర్‌ని పిలవా లనిపించలేదతనికి... అతని మనసులో ఏమిటో తుఫానులాగ ఉంది.

వెళ్ళేసరికి వసుంధర వెళ్లే రైలు ప్లాట్‌ఫామ్ మీదకి వొచ్చింది. ఆమెకి పళ్ళు, బిస్కట్లు, మంచినీళ్ళు ఇచ్చి మళ్ళీ ఒక అరగంట కబుర్లు చెప్పేక రైలు వెళ్ళిపోయింది. అతను ఇంటికి తిరిగి వొచ్చేడు.

తలుపుతీసే ఉంది. అతను లోపలికి అడుగు పెట్టేసరికి డ్రాయింగ్‌రూమ్‌లో రమా, పక్కింటి పిన్నిగారి అమ్మాయీ, ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. పిన్నిగారేమో కొంచెం అటు జరిగి కూర్చున్నారు.

గోపాలానికి అప్పటికి అర్థమైంది తను చేసినపనిలో ఉన్న సీరియస్‌నెస్. అతను తలవంచుకునే లోపలికి వెళ్ళి పోయాడు. జరిగిన నిజాన్ని రమకెలాగ నచ్చజెప్పాలో అతనికి భోధపడలేదు... ఏం చెప్పినా రమ నమ్మదు...

నాలుగైదు నిమిషాల తరవాత రమ కాఫీ తెచ్చియిస్తూ, "ఎక్కడికెళ్లేరు?... మీకోసం మేరీ వొచ్చింది" అంది.

"మళ్ళీనా?" అన్నాడు గోపాలం.

"అవును ఆమెకి రేపు సెలవు కావాలిట... వాళ్ళంతా ఎక్కడికో వెడతారట... చెప్దామని వొచ్చింది."

అవును అనుకున్నాడు గోపాలం. ఉంటే వసుంధరనీ, లేకపోతే రమనీ చూడ్డానికి.. సెలవు ఒక మిష...

"స్టేషన్‌కి వెళ్ళేను - వసుంధరని వొదిలిరావడానికి..."

"అలాగా! కాఫీ తాగండి..."

అతనికి తాగాలనిపించలేదు.

"పిన్నిగారూ వాళ్ళమ్మాయీ అన్నీ చెప్పేఉంటారు... మేరీ సరేసరి!" అన్నాడు గోపాలం.

"అవునండీ!... నాతో చెప్పలేదేం? ఎంతో చక్కగా ఉంటుందిటగదా?..." అంది రమ.

"అనుకోకుండా కలిసింది - మరొకందుకు స్టేషన్‌కి వెడితే..." అన్నాడు దోషిలాగ, గోపాలం.

"అలాగే అనుకున్నాను"

నిశ్శబ్దం.

"చిన్నప్పుడు మేమిద్దరం మంచి స్నేహితులం..."

"కాఫీ చల్లారిపోతోంది..."

"వసుంధర చాలా మంచి మనిషి... నువ్వు లేవని చాలా డిసపాయింట్ అయింది!"

"పాపం!"

అతను కాఫీ కొంచెం సిప్ చేశాడు. రమ ఏమిటో తీవ్రంగా ఆలోచిస్తూంది... అదేమిటో అతనికి తెలుసును!

"చూడు రమా ... నా సంగతి నీకు తెలుసును." అన్నాడు, ఉపోద్ఘాతంగా... ఈ విషయం త్వరగా పరిష్కారం అయితే మంచిదని.

"అవును..." అంది రమ.

"వసుంధర నాకు ఎంతోకాలంనించి తెలుసును. ఆ రోజుల్లో నేనంటే ప్రాణం పెట్టేది!"

రమ ఏమీ అనలేదు.

"నువ్వింట్లో ఉండవని అనుకోలేదు. ఆమె అనుకోకుండా వొచ్చింది.."

"చెప్పేరు..."

"పక్కింటి పిన్నిగారూ, వాళ్ళమ్మాయీ - చివరకి మేరీ - ఏం చెప్పినా నువ్వు నమ్మకూడదు... ఏం?"

రమ ఒక్కసారి అతనివైపు చూసి, విరగబడి నవ్వింది.

గోపాలం తెల్లబోయాడు.

"ఏమిటది?" అన్నాడు చిరాకుతో.

"అదా?... మీకు నామీద ఉన్న అనుమానానికి... రామ రామా! మీ సంగతి తెలీదుటండీ? అందుకా, ఈ ఉపోద్ఘాతం!... "అని మళ్ళీ నవ్వసాగింది రమ.

ఆశ్చర్యంగా చూశాడు గోపాలం.

"మరి - పక్కింటివాళ్ళు..."

"అదో సరదాలేండి?... ఛీ! మీ అనుమానాలూ మీరూను" అంది రమ.

"మరి నువ్వెందుకలాగ ఉన్నావు?"

"కోపం వొచ్చింది."

"ఎందుకు?"

"ఫ్రిజ్‌లో అన్ని ఉంచితే మీరు మంచినీళ్ళిచ్చి పంపేశారు ఆ అమ్మాయిని..." నన్నుగురించి ఏమనుకుంటుంది?"

ఇబ్బందిగా ఉంది గోపాలానికి. జరుగుతున్నదేమిటో బోధపడలేదు.

"చూడు... రమా! నువ్వు నిజమే చెప్తున్నావా?" అన్నాడు కష్టంతో.

"బాగుంది ప్రశ్న!" అంది రమ నవ్వుతూ.

"అంటే నా మీద ఏమీ అనుమానం లేదన్నమాట!"

"లేదు..."

"వసుంధరని తీసికొచ్చినందుకు..."

"మంచిపని చేశారు... మరి నేను వెళ్ళొచ్చునా?"

అతనివైపు నవ్వుకళ్ళతోనే చూసి, రమ లోపలికి వెళ్ళిపోయింది.

ప్రశాంతిగా ఉంది గోపాలానికి.

రమ... చాలా ఉత్తమురాలు. తనమీద ఆమెకి ఏమీ అనుమానం లేదు!

భయపడ్డదంతా క్షణంలో మిధ్య ఐపోయింది.

తాను అదృష్టవంతుడు. రమ... కాని- ఆమెకి ఎందుకసలు అనుమానం లేదు?

ఆమె మంచితనమా?

లేక... తన చేతగానితనం ఆమెకి తెలిసిపోయిందా? అదేకదా, ఆమె ఉద్దేశం?... ఎంత పరిచయం ఉన్నా, ఎంత అందగత్తెతో ఎంతసేపు తాను ఏకాంతంలో ఉన్నా, ఆమెకి భయం లేదు!

అతనికి రమమీద కోపం వొచ్చింది. కనీసం తనని ఎక్స్‌ప్లనేషన్ అయినా అడగదేం? ఆమె దృష్టిలో తాను కేవలం అపాయంలేని మంచివాడేనా?

అతని కోపం త్వరత్వరగా హెచ్చిపోయింది.

విసుగ్గా లేచి నిలబడి, గోపాలం అటూ ఇటూ చూశాడు.,

చేతికర్ర కనబడింది.

తీసుకుని, మహా కోపంతో అతను అడుగులు వేసి, నడచి వెళ్లాడు... కోపం తగ్గేదాకా. పార్కులో నడిచిరావడానికి.

❋ ❋ ❋